# ప్రదక్షిణం

"ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, న్యూజెర్సీ తెలుగు కళాసమితి, రాజలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన 1997 కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

నీ జాతకం మీద శని ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. గ్రహసంచారం ప్రకారం ప్రస్తుతం నీకు ఏల్నాటి శని నడుస్తోంది. శనిని తక్కువగా అంచనా వెయ్యడానికి వీల్లేదు.

శని పాపగ్రహం. సాక్షాత్తు ఆ పరమేశ్వరుడికే శనిపీడ తప్పలేదు.

శని చెయ్యని అపకారం లేదు. ఉన్న ఉద్యోగం ఊడగొడతాడు. తీవ్ర అనారోగ్యం ఇస్తాడు. అన్యోన్యంగా ఉండే దంపతులు విడిపోతారు. దారిద్రం సంప్రాప్తించేటట్టు చేస్తాడు.

అరవింద్ తెల్లబోయి యాజులుగారి మొహంలోకి చూస్తున్నాడు.

"ఏల్నాటి శని ఒకటే కాదు. నీ జాతకంలో మరోదుష్ఫలితం ఉంది. గురువు శుభగ్రహం. ఎవరికీ హాని చెయ్యడు. గురువు నీకు ఉపకారి. కాని నీ జాతకంలో ప్రస్తుతం గురు శనిలకు షష్టాష్టకం నడుస్తోంది. దీని వల్ల గురువు నీకు ఉపకారం చేద్దామన్నా శని చెయ్యనివ్వడు".

అరవింద్‌కి నోటమాట రాలేదు.

తన నెవరో గోతిలోకి గెంటేసి మీద రాళ్ళు వేస్తున్నట్టుగా అనిపించింది.

అతనికి భయం వేసింది.

"మరి....మరి...నేనేం చెయ్యాలి?"

బేలగా అడిగాడు.

"శనికి పంథొమ్మిది వేలు జపం చేయించాలి. తైలాభిషేకం చేయించాలి. తిలా దానం ఇవ్వాలి. తర్వాత తర్పణం చెయ్యాలి. దీనివల్ల కొంత ఉపశమనం కలుగుతుంది."

"నా పరిస్థితి నేను ముందే చెప్పాను. నాదగ్గర డబ్బులేదు. వేరే మార్గం ఉంటే చెప్పండి" అరవింద్ యాజులు గార్ని బతిమాలుతున్న ధోరణిలో అడిగాడు.



"సరే ఓపని చెయ్యి. నేనో మంత్రం రాసిస్తాను. రోజు జపం చెయ్యి. రామాలయంలో నవగ్రహాలున్నాయి. ప్రతిరోజు శనికి మూట ఎనిమిది ప్రదక్షిణాలు చెయ్యి".

"సరనే-ఆమంత్రం రాసివ్వండి".

యాజులుగారు మంత్రం రాసిచ్చారు.

అరవింద్ జేబులో అయిదు రూపాయలు మాత్రం ఉంది. అది తీసి యాజులు గారికిస్తూ "నాదగ్గర ఇదే ఉంది" అన్నాడు.

ఆయన చిర్నవు నవ్వారు.

"నేను జ్యోతిషం చెప్పినందుకు ఏవీ తీసుకోను. నాకు దేనిమీద సంపాదించాల్సిన అవసరం కూడా లేదు" అన్నారు.

"సరే-మళ్ళీ కలుస్తాను" అని చెప్పి యాజులు గారికి పాదాభివందనం చేసి అరవింద్ వెళ్ళిపోయాడు.

* మంచి మార్కులతో బి.ఎ పాసై ఉద్యోగం దొరక్క ఇబ్బంది పడుతున్న అరవింద్‌ని అతని స్నేహితుడు రమణ హైదరాబాద్ తీసుకొచ్చాడు. అతనికి కాస్త మంచి ఉద్యోగమే ఉంది.

"నాతోపాటే నారూంలో ఉండు. మనిద్దరం వండుకుని తిందాం. నీ ఉద్యోగప్రయత్నం చేద్దాం" అన్నాడు రమణ.

అరవింద్ సిటీ అంతా తిరిగాడు. తెల్సున్నవాళ్ళం

## వీరభద్రరావ్ పమ్మి

దర్నీ అడిగాడు. పేపర్లో కనిపించిన ప్రతి ప్రకటనకి బదులుగా అప్లికేషన్ పంపాడు.

ఆర్నెల్లు దాటిపోయింది. ఉద్యోగం మాత్రం రాలేదు. ఉద్యోగం రాలేదన్న బాధ ఒక పక్క, రమణకి భారం అయ్యానన్న బాధ మరోపక్క అతన్ని పీడిస్తోంది.

ఇంటి దగ్గర తండ్రి పరిస్థితి అంతంత మాత్రం. అంతకీ ఆయన నెలకో వందో, రెండొందలో పంపిస్తూనే ఉన్నాడు. ఆ డబ్బు సిటీలో తిరగడానికి, అప్లికేషన్లకి, పోస్టల్ ఆర్డర్లకి, స్టాంపులకి, కవర్లకి సరిపోతుంది.

రమణ కూడా అప్పుడప్పుడు ఆదుకుంటూనే ఉన్నాడు.

"ఒరేయ్ ఇంత సహాయం చేస్తున్నావు. నీరుణం ఎలా తీర్చుకోవాలో" అని రమణతో అంటే-

"రుణాలు లేవు-ఏపీ లేవు. నీకు చేతనైతే ఉద్యోగం వచ్చాక మరో పేదకుర్రాడికి సాయం చెయ్యి. మానవజాతి ఇలాగే ఒకరి అనరా తీసుకుని మరొకరు ఎదగాలి" అంటాడు.

అరవింద్‌కి గవర్నమెంటు ఉద్యోగం వస్తుందన్న ఆశ నవ్వగిలి పోయింది. అయిదు పోస్టులుంటే అందులో మూడు రిజర్వేషన్లు.

తొంభై మార్కులొచ్చిన వాడికి కాలేజీలో సీటు గాని, గవర్నమెంటులో ఉద్యోగంగాని రాని పరిస్థితి బహుశా ఈదేశంలోనే ఉందేమో?

అందుకే బాగా చదువుకున్న వాళ్ళంతా అమెరికాలాంటి దేశాలు వెళ్ళిపోతున్నారు.

జనగణమన అధినాయక జయహే!

* ఆవేళ శని త్రయోదశి.

శనివారం నాడు త్రయోదశి తిధివస్తే అది శనిత్రయోదశి. ఆరోజు శని జపం చేసినా, ప్రదక్షిణాలు చేసినా ఎక్కువ ఫలితం కలుగుతుందని యాజులుగారు చెప్పారు.

అరవింద్‌కి మరో సమస్య ఎదురైంది.

అదేరోజు సాయంత్రం ఊరి చివర పటాన్ చెరువులో అతనికో ఇంటర్వ్యూ ఉంది. పొద్దున్నే శనికి ప్రదక్షిణాలు చేసి, సాయంత్రం ఇంటర్వ్యూకి వెళ్ళొచ్చు ఇబ్బంది ఏమీ లేదు.

కాని....

అతని జేబులో రెండు రూపాయలు మాత్రం ఉన్నాయి. ఇంటర్వ్యూకి బస్‌లో వెళ్ళిరావాలి. కనీసం పదిహేను రూపాయలు కావాలి.

సమయానికి రమణ ఊళ్ళోలేడు.

ఆఉద్యోగం తప్పకుండా వస్తుందని అరవింద్‌కి నమ్మకముంది. ఇన్నాళ్ళు తను చేసిన జపాలు, ప్రదక్షిణాలు తప్పకుండా ఫలిస్తాయని అతనికి నమ్మకమయింది.

ఎవర్నేనా అప్పడగాలి.

ఎలాగైనా ఇంటర్వ్యూకి వెళ్ళాలి.

ఎలాగైనా ఆ ఉద్యోగం దక్కించుకోవాలి.

ఎలాగైనా ఈ నిరుద్యోగ నరకాన్నుంచి బైటపడాలి.

అరవింద్ రకరకాలుగా ఆలోచించాడు. ఎన్నో లెక్కలు వేసాడు. పదిహేను రూపాయల సమాధానం మాత్రం దొరకలేదు.

అతని జేబులో రెండు రూపాయలు మాత్రం ఉన్నాయి. ఇంటర్వ్యూకి బస్‌లో వెళ్ళిరావాలి. కనీసం పదిహేను రూపాయలు కావాలి.

ఆలా ఆలోచిస్తూ రామాలయానికి వెళ్ళాడు.

రామాలయం చాలా సందడిగా, హడావుడిగా ఉంది. శనిత్రయోదశి వల్ల చాలామంది తైలాభిషేకం చేయించుకుంటున్నారు.

నవగ్రహాల చుట్టూ జనం కిటకిటలాడిపోతున్నారు. ప్రశాంతతలేని వాతావరణంలో ప్రదక్షిణాలు చెయ్యడం అరవింద్‌కి ఇష్టం లేదు. పదకొండు గంటలకు హడావుడి తగ్గిపోతుంది. అప్పుడు ప్రదక్షిణాలు చెయ్యాలని నిర్ణయించుకుని రూంకి తిరుగుముఖం పట్టాడు.

తిరిగి వెడతుంటే ఆతనికి పాతపేపర్లు, పుస్తకాలు కొనేషాపు కనిపించింది. అతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

గబాగబా రూంకి వెళ్ళి తనుడిగ్రీలో చదువుకున్న పుస్తకాలు తెచ్చి అమ్మేసాడు. షాపువాడు ఆర్రూపాయలు చేతిలో పెట్టాడు.

ఇంకా ఏడు రూపాయలు కావాలి.

ఎలా? ఎలా? ఎలా?

ఆందోళనపడి ఉపయోగం లేదు. ఏదో మార్గం కనబడకపోతు అనుకున్నాడు. పదకొండు గంటలకి గుడికి వెళ్ళాడు. గుడి నిర్మానుష్యంగా ఉంది. గుడి తలుపులు మూసేసారు. మెయిన్‌గేటు మాత్రం తెరిచిఉంది.

అరవింద్ ప్రదక్షిణాలు చెయ్యడం మొదలెట్టాడు. ఒకటి....రెండు....మూడు.....

పాతిక పూర్తయ్యేసరికి అతనికో ఆలోచన తట్టింది.

ఏభై పూర్తయేసరికి అతనో నిశ్చయానికి వచ్చాడు.

మాట ఎనిమిది పూర్తయ్యాక....

అతను శని విగ్రహం దగ్గర భక్తులు వేసిన రూపాయి నాణాలు వేళ్ళతో మెల్లగా తియ్యడం మొదలెట్టాడు.

సరిగా ఏడు రూపాయలు మాత్రం తీసుకున్నాడు.

నూతి దగ్గర కాళ్ళు కుదుక్కుని నూనె అంటుకున్న రూపాయి నాణాలు కూడా శుభ్రంగా కడిగాడు. జేబులో వేసుకుని బైటికి నడిచాడు.

* ఇరవై రోజులు గడిచాయి.

ఆరోజు అరవింద్‌కి ఆనెలలో అతను పని చేసిన రోజులకి జీతం ఇచ్చారు. సాయంత్రం రూంకివచ్చి బట్టలు మార్చుకుని గుడికి వెళ్ళాడు.

శనికి ప్రదక్షిణాలు చేసి.....

జేబులోంచి ఇరవై అయిదు రూపాయి బిళ్ళలు తీసి శని విగ్రహం దగ్గర పెట్టాడు.

"క్షమించు శనీశ్వరా! ఆరోజు వేరే దిక్కులేక అలా చేసాను. జుర్మానాతో సహా నీడబ్బులు తిరిగి ఇచ్చేస్తున్నాను. "కళ్ళు మూసుకుని ప్రార్థించాడు.

గుడి నిర్మానుష్యంగా ఉంది.

గుడి ప్రాంగణంలో ఓ మూల కూర్చున్నాడు.

ఓ యువకుడు హడావుడిగా గుడి ప్రాంగణంలోకి వచ్చాడు. శనికి ప్రదక్షిణాలు చేసాడు. అటుఇటు చూసాడు. అతని వేళ్ళు చకచకా కదుల్తున్నాయి.

శని విగ్రహం దగ్గర అరవింద్ ఉంచిన రూపాయి నాణాలు మెల్లగా అతని చేతిలోకి వెడుతున్నాయి.

అరవింద్‌కి నవ్వొచ్చింది.

అతని మనసు ప్రదక్షిణాలు చెయ్యడం మొదలెట్టింది.

* * *

—మిత్రుడు,

కీ.శే. పి.శంకరనారాయణకు-నమ్మి.

